


ఐఆర్‌పిడబ్ల్యుఎ డైరెక్టర్ ప్రకాశ్ మృతి



ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, ఐఆర్‌పిడబ్ల్యుఎ ఎన్‌జిఒ సంస్థ డైరెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు పెదిరెడ్ల ప్రకాశ్ శనివారం ఉదయం విజయనగరం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. ఈయన ఎన్‌జిఒ సంస్థ ద్వారా చాలా కాలంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మృతికి జిల్లావ్యాప్తంగా పలువురు తీవ్ర సంతాపాన్ని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



మళ్లీ మొదలైన రాజకీయ వేడి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. స్థానిక నగర పంచాయతీ చైర్మన్ పీఠం విషయంలో చిక్కుముడి ఇంకా వీడలేదు. నగర పంచాయతీ చైర్మన్ ఎస్సీ మహిళకు కేటాయించగా, 19వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికైన యందవ రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో ఇటీవల చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీ అయింది. అయితే ప్రభుత్వం వైస్ చైర్మన్-2 పల్లా ప్రతాప్‌ను చైర్మన్‌గా నియమిస్తూ గత ఏడాది డిసెంబర్‌లో ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఖాళీగా ఉన్న చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికకు ఈనెల 3న నోటిఫికేషన్ ఇచ్చి ఎన్నిక జరిపించినప్పటికీ ఇక్కడ ఎన్నిక జరగలేదు. రెండో వార్డు నుంచి వైసిపి తరపున ఎస్‌సి కేటగిరికి చెందిన కౌన్సిలర్ ఆకుల

17న చైర్మన్ ఎన్నిక

మల్లేశ్వరి చైర్మన్ అవుతారని భావించినప్పటికీ ఇటీవల ఆమె తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో ఆమె స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ఎన్నికల అధికారులు చెప్పడంతో బెడిసి కొట్టింది. వైసిపి విప్ జారీ చేసి ఇరకాటంలో పెట్టింది. దీంతో రెండుసార్లు ఎన్నిక వాయిదా పడింది. అయితే ఎలాగైనా పాలకొండ నగర పంచాయతీలో చైర్మన్ కుర్చీని కైవసం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ పెద్దలు పట్టుపడుతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆగమేఘాల మీద మళ్లీ చైర్మన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి ఏం జరుగుతుందోనని అందరిలో కూడా చర్చ జరుగుతుంది.


పద్మజను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పద్మజను సత్కరించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

స్వచ్ఛ దివస్ సందర్భంగా కందుకూరులో శనివారం జరిగిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు వెనిగండ్ల పద్మజను సత్కరించారు. ఆమె ఆధ్వర్యంలో జరుగుతున్న వ్యర్థ పదార్థాల నిర్వహణలో గణనీయమైన కృషిని గుర్తించి ఆమెను ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి అభినందించారు. ఆమె చేస్తున్న కృషి జిల్లా అంతటా విస్తరించాలని, ఆమె మోడల్‌ను రాష్ట్రంలో అన్ని జిల్లాలూ అనుసరించేలా కార్యక్రమాలు చేపట్టాలని అందుకు ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలూ అందిస్తామని సభాముఖంగా సిఎం హామీ ఇచ్చారు.

సురక్షిత ప్రయాణం అందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్


డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించి వారిని గమ్యస్థానానికి ఆర్టీసీ డ్రైవర్లు చేరవేయాలని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ముగింపు సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్‌పి మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించాలని సూచించారు. అనంతరం ఇప్పటి వరకు ఒక్క ప్రమాదం చేయని పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోలకు చెందిన 12మంది ఉత్తమ డ్రైవర్లను వారి భార్యలను కలిపి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్.ఎం.శశి కుమార్, డాక్టర్ పి.నారాయణ రావు, పాలకొండ, పార్వతీపురం డిఎంలు పి.వెంకటేశ్వర రావు, ఇఎస్ కె .దుర్గ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, కావున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛంధ్రా - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదబొండపల్లి, దిబ్బగుడివలస గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య, ఉపాధిహామీ కార్యక్రమాలను కలెక్టర్ శనివారం పరిశీలించారు. తొలుత పెదబొండపల్లిలో చేపట్టిన పారిశుధ్య పనులను పర్యవేక్షించి, మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తుండాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. కొబ్బరి బొండాలు, టైర్లు, సీసాలు, వాటర్ బాటిళ్లు వంటి వాటిని నిల్వ చేయరాదని, తద్వారా దోమలు వ్యాప్తి చెంది పలు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని సూచించారు. ప్రతి రోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరుచేయాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని గృహ యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని వర్మీకంపోస్టును పరిశీలించి, చెత్త నుంచి సంపదను సృష్టించవచ్చుని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజూ సేకరించిన తడి, పొడిచెత్తను వేరుచేసి వర్మీకంపోస్టుగా చేయడం ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం దిబ్బగుడివలసలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా ఉపాధిహామీలో నిర్మించిన మినీ గోకులాలను సందర్శించి, వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి షెడ్లు మరిన్ని నిర్మించుకునేందుకు అవకాశం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే నిర్మాణ దశలో ఉన్న ఇంకుడు గుంతలను పరిశీలించిన కలెక్టర్ వాటిపై లబ్దిదారులకు అవగాహన కల్పించారు.

ఈ పర్యటనలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డిపిఒ టి.కొండలరావు, డిఎల్‌డిఒ రమేష్ రామన్, తహశీల్దార్ వై.జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పెద్దబొండపల్లిలో చెత్తను దగ్గరుండి తొలగిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి

పార్వతీపురం: జిల్లాలోని ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్త నుంచి సంపదను సృష్టించే దానిపై దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివాస్, ఎంఎస్‌ఎంఇల సర్వేపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరుచేసి, వర్మీకంపోస్టుల ద్వారా సంపద సృష్టించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. దీనికి ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని సూచించారు. పట్టణ, గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య వివరాలను యాప్‌లో నమోదు కావాలన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేయకపోయినా, పారిశుధ్య పనులు చేపట్టకపోయినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్మీకంపోస్టుకు జిల్లాలో మంచి గిరాకీ ఉందని, ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కంపోస్టులను ఏర్పాటు చేసి సంపదను సృష్టిస్తున్నారని, అదేవిధంగా వీలైనన్ని సంపద కేంద్రాలను ఏర్పాటు చేసుకో గలిగితే గ్రామాల పారిశుధ్యంతో పాటు ఆదాయం లభిస్తుందని తెలిపారు. అనంతరం ఎంఎస్‌ఎంఇల (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు) సర్వే గురించి మాట్లాడుతూ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రతి సచివాలయ పరిధిలో రోజుకు కనీసం ఐదు ఎంఎస్‌ఎంఇల సర్వే చేయాలని లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, ఆ దిశగా సర్వే పూర్తిచేయాలని తేల్చిచెప్పారు. ఈ విషయంలో సంబంధిత అధికారులను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని, ఎంపిడిఒలు, మునిసిపల్ కమిషనర్లు ప్రతి రోజూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిపిఒ టి.కొండలరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో పదో తరగతి చదివే విద్యార్థులంతా శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. కొందరు విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నట్లు గురువారం నిర్వహించిన పల్లెనిద్రలో గమనించానన్నారు. అటువంటి విద్యార్థులంతా సబ్జెక్టుపై మంచి పట్టు సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. క్లస్టర్ ఉపాధ్యాయులతో పట్టణంలోని కొత్త పోలమ్మ పురపాలక ఉన్నత పాఠశాలలో శనివారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ నెల వరకు సిలబస్‌ను పూర్తి చేయడంపై క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి విద్యా తీరు విశ్లేషణ ఆధారంగా వారికి తగిన బోధన చేయాలని తెలిపారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థులను దత్తత తీసుకొని ప్రత్యేకంగా బోధించాలన్నారు. పరీక్షలకు కొద్ది సమయం ఉన్నందున అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల మార్గదర్శకత్వంలో మోడల్ పాఠాలను తయారు చేసి, ఉత్తమ బోధన చేయాలని కలెక్టర్ హితవు పలికారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎన్.తిరుపతినాయుడు, ఉప విద్యాశాఖాధి కారులు, ఎంఇఒలు, క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి : డిడి

సాలూరు : రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి కోరారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని మావుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, సిబ్బంది తో కలిసి పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఉన్న తుప్పలు, డొంకలను తొలగించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల పేపర్లు అందజేశారు. ప్రశ్నాపత్రాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్‌జె సన్యాసిరావు, వార్డెన్ ఒ.శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణి


అనకాపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

అవకాశమివ్వండి.. మీ గళం వినిపిస్తా

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే చట్టసభల్లో ఉపాధ్యాయుల గొంతు వినిపిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం ఆమె అనకాపల్లిలోని చినబాబు కాలనీ, గుండాల వీధి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యా రంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పని చేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. అటువంటి వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారని, అటువంటి పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

విజయగౌరిని గెలిపించండి : మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

విజయనగరం : ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని మాజీఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఉపాధ్యాయులను కోరారు. విజయగౌరికి మద్దతుగా నగరంలోని పలు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అలుపెరుగని పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రధానంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంక్షేమానికి, వారి వాణిని చట్ట సభల్లో వినిపించాలంటే విజయగౌరిని గెలిపించాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. వెల్ఫేర్‌బోర్డు, ప్రత్యేక పింఛను స్కీం, హెల్త్‌కార్డుల మంజూరు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాడుతారని తెలిపారు. కావున విజయగౌరిని మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. మరోవైపు జిల్లాలో జరిగిన స్కూలు కాంప్లెక్సుల్లో విజయగౌరికి ఓటు వేయాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు ప్రచారం చేపట్టారు.

సుర్రుమంటున్న సూరీడు

రాత్రి చల్లదనం.. పగలు మండుటెండలు

పగటిపూట 30- 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి - కురుపాం

ఫిబ్రవరి తొలినాళ్లలోనే సూరీడు సుర్రుమంటున్నాడు. సహజంగా శివరాత్రికి చలి 'శివశివ' అంటూ పోయి, వేసవి ప్రారంభమయ్యేది. అయితే గడిచిన నాలుగైదు ఏళ్లుగా వాతావరణంలో సంభవించిన పెనుమార్పుల వల్ల ఫిబ్రవరి చివరిలోనే ఎండలు మండుతూ వస్తున్నాయి. ఈ ఏడాది భానుడి ప్రతాపం ఎక్కువేనని వాతావరణ శాఖ ముందే హెచ్చరికలు జారీ చేసింది. దీనికి తగ్గట్టే ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండలు మండుతున్నాయి. మన్యం జిల్లాలో పగటిపూట 30-36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఇళ్లల్లోనూ, ఆఫీసుల్లోనూ ఎసిలు 'ఆన్' అయ్యాయి. ఈ ఏడాది వేసవి ముందే వచ్చేసింది. ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడి ప్రతాపం కనిపిస్తోంది. గతంలో మార్చి 15 నుంచి ఎండాకాలం మొదలయ్యేది. విద్యార్థులకు ఒంటి పూట బడులు అప్పుడే మొదలయ్యేవి. ఈసారి వాతావరణంతో ఫిబ్రవరిలో ఏమాత్రం పగటిపూట చల్లగా ఉండడం లేదు.

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 40-46 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత


ఫిబ్రవరిలోనే ఉష్ణోగ్రతలు ఎక్కువగా మొదలు కావడంతో మార్చి, ఏప్రిల్, మేలో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 46 డిగ్రీల నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది మన్యం జిల్లాలో మేలో 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాలున్నాయి. ఈసారి ఏప్రిల్, మేలో పగటి పూట ఉష్ణోగ్రతలు కొంత వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. మన్యంలో అడవుల విస్తీర్ణంలో తగ్గుతూ ఏటేటా పచ్చదనం తగ్గిపోతూ ఉండడంతో ఉష్ణోగ్రతలు పెరిగి వేడి గాలులు వీచే అవకాశాలు ఉన్నాయి. ఏదిఏమైనా ప్రకృతి సమతుల్యత పాటించకపోవడం వల్ల జీడిమామిడి పోక తప్పదు. తాగునీటి సమస్యా తలెత్తే ప్రమాదం ఉంది.


ఎండలకు బోసిపోయిన మెయిన్‌రోడ్డు

చెరకు రైతుల్ని ముంచేశారు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! మొత్తానికి జిల్లాలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతుల్ని పాలకులు ముంచేశారు. దశాబ్దాల చరిత్రగల ఈ ఫ్యాక్టరీని మూసివేశారు. ఈ విషయం తాజాగా ఆ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ విఎస్ నాయుడు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనతో మరోసారి స్పష్టమైంది. ఈ విషయంలో నాటి వైసిపి, టిడిపి ప్రభుత్వాలు దొందూ దొందే. ఆయా పార్టీలు, ప్రభుత్వాలు చెరకు రైతులపై ఇన్నాళ్లూ కార్చింది మొసలి కన్నీరేనని స్పష్టమైంది. ఉమ్మడి విజయనగరం జిల్లా ఒకప్పుడు చెరకు సాగుకు పెట్టింది పేరు. జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడం వల్ల చెరకు పంటే గత్యంతరంగా ఉండేది. దీనికితోడు ఆ పంట సాగుకు ఈ ప్రాంత భూములు కూడా ఎంతో అనువుగా ఉన్నాయి. ఈనేపథ్యంలో జామి మండలంలోని భీమసింగి దరి కుమరాంలో శ్రీ విజయరామ గజపతి కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీని 1960లో అప్పటి ప్రభుత్వమే సహకారం రంగంలో ఏర్పాటు చేసింది. లక్ష్యానికి తగ్గట్టే ఈ ప్రాంత అభివృద్ధిలో ఫ్యాక్టరీ కీలకపాత్ర పోషించింది. పాలకుల నిర్లక్ష్యం వల్ల మారుతున్న టెక్నాలజీ అందుకోవడంలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ రైతులకు ఎంతో ఆసరాగా నిలిచింది. ఒకప్పుడు చంద్రబాబు ప్రభుత్వమే దీన్ని మూసివేసింది. 2004 ఎన్నికలకు ముందు వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాదయాత్రలో భాగంగా ఫ్యాక్టరీని తెరిపించేందుకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకు మాట నిలబెట్టుకున్నారు. దీంతో, రైతులు ఒకింత ఊపిరి పీల్చుకుంటూ చెరకు సాగుపై మరింత ఉత్సాహం చూపారు. చెరకు స్థానికంగానే విక్రయించుకునే పరిస్థితి ఉండడం వల్ల రైతులు, తిరిగి పున:ప్రారంభం వల్ల అందులో పనిచేస్తున్న వందలాది మంది కార్మికులు, ఉద్యోగుల జీవితాలకు భరోసా కలిగింది. చెరకు బళ్లు, రైతులు, కార్మికులు, ఉద్యోగులతో భీమసింగి ప్రాంతంలో నిత్యం కళకళాడేది. 2014లో తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సహకార రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలు అవలంభించడంతో ఫ్యాక్టరీ మనుగడ కష్టనష్టాల్లోకి వెళ్లింది. 2019 ఎన్నికల ముందు ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఈ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని, తన తండ్రి పున:ప్రారంభించిన ఈ ఫ్యాక్టరీని చంద్రబాబు కుదేలు చేశారు. ఈ



మాటలు నమ్మిన ఈ జిల్లా, భీమసింగి ప్రాంతవాసులు వైసిపికి పట్టం కట్టారు. ఓడదాటే వరకు ఓడమల్లన్న.... ఓడ దాటకా బోడి మల్లన్న అన్నట్టుగా ఆధునీకరణ పేరిట 2019 ఆగస్టులో చెరకు క్రషింగ్ నిలిపివేశారు. ఎప్పటికీ తెరవరకపోవడంతో సిపిఎం ఆధ్వర్యాన రైతులు సుదీర్ఘమైన పోరాటాలు చేసిన సంగతి తెలిసిందే. నాటి జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ ఇదిగో అదిగో అంటూనే చివరికి ఫ్యాక్టరీ సామర్థ్యానికి తగ్గట్టు చెరకు సాగుచేయడంలేదంటూ రైతులపైకి నెట్టేశారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీ భవిష్యత్తు కోసం ఆలోచిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం నోరు తెరవడం లేదు. పైగా జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందని వ్యాఖ్యానించారు. ఫ్యాక్టరీని తెరిపించాలంటూ ఇటీవల రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ ఎమ్‌డితో ప్రభుత్వం ఒక ప్రకటన ఇప్పించింది. 'ఫ్యాక్టరీలో 2020-21 సీజన్ నుంచే చెరకు క్రషింగ్ నిలుపుదల చేశాం. ఇందులో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులు, కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు విఆర్‌ఎస్ వివరాలను 2022 జూన్ 12న జరిగిన ది గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం కోరింది' అంటూ ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని బట్టి ఫ్యాక్టరీ మూతలో రెండు ప్రభుత్వాలదీ ఒకటే విధానం అన్నది తేలిపోయింది.

ఫ్యాక్టరీ సామర్థ్యానికి తగ్గట్టు చెరకు సాగుచేయడం లేదంటూ రైతులపైకి పాలకులు నెట్టేశారు. కానీ, సాగు విస్తీర్ణం పెరగాలంటే చెరకు రైతులను ప్రోత్సహించాలి కాదా? అలా ప్రోత్సహించాల్సిన బాధ్యత, అవసరం ప్రభుత్వానికి లేదా? నాటి ప్రభుత్వం ఎందుకు అలాంటి ప్రయత్నం చేయలేదు అంటూ రైతులు, ఎపి రైతు సంఘం నాయకులు, చెరకు రైతుల సంఘం నాయకులు నాటి నుంచీ ప్రశ్నిస్తునే ఉన్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో చెరకు సాగు సాగువిస్తీర్ణం 50వేల ఎకరాలకుపైగా ఉండేది. వైసిపి ప్రభుత్వంలోగానీ, టిడిపి ప్రభుత్వంలోగానీ చెరకు పరిశోధనలు నిర్వహించలేదు. ఫలితంగా సుమారు పదేళ్లగా కొత్తరకం విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్ల దిగుబడి కూడా సగానికి సగం తగ్గిపోతోంది. సుగర్ రికవరీ రేటు కూడా మన రాష్ట్రంలో 9.5శాతానికి మించిరావడం లేదు. మరోవైపు చెరకు రైతులకు సబ్సిడీ పథకాలు లేవు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్పత్తికి అయ్యే ఖర్చుపై మద్ధతు ధర ప్రకటించకపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. ధరలో లోటును భర్తీచేసే చెరకు పాలసీని కూడా పదేళ్ల క్రితమే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో, జిల్లాలో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. ఇందుకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వమే రైతులపైకి నెట్టేయడం ఎంత వరకు సమంజసం అని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందంటూ మంత్రి కొండపల్లి చేసిన వ్యాఖ్యలు కూడా నేటి ప్రభుత్వ విధానాన్ని, మోసకారి తనాన్ని బయటపెట్టాయి. వాస్తవానికి సహకార సంఘాలను ఏర్పాటుచేసింది లాభాలు ఆర్జించడం కోసం కాదు. లాభ నష్టాలతో సంబంధం లేకుండా రైతులకు లేదా సంబంధిత రంగాలకు చెందిన ప్రజలకు చేదోడువాదోడుగా ఉండేందుకు. ఈ సంగతి అమాత్యులకు తెలియదనుకోలేం. చంపేయాలనుకున్న కుక్కపై పిచ్చికుక్కగా ముద్రవేసి పనికానిచ్చినట్టే... ఫ్యాక్టరీని మూసేయాలనే ప్రభుత్వ విధానంలో భాగంగానే ఆయన నోట వెనుక లాభనష్టాలు గుర్తుకు వచ్చాయి అనేది పబ్లిక్ టాక్.



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి చేయాలి

ఎమ్మెల్యేకు గిరిజనులు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలోని కొమరాడ మండలంలో గల పూర్ణపాడు-లాబేసు వంతెన పనులను పూర్తి చేసి ప్రజల రాకపోకలకు వీలు కల్పించాలని కెమిసీల, గుణదతీలేసు పంచాయితీలకు చెందిన హెచ్.బలరాం, సిహెచ్ ప్రతాప్, గాంధీ, అప్పలస్వామి, డప్పుకోట బలరాం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి శనివారం వినతిని అందించారు. గత కొన్ని ఏళ్లుగా వంతెన నిర్మాణం మధ్యలోనే నిలిచి పోవడంతో వర్షకాలంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. సమస్యను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వంతెన నాలుగు ఫిల్లర్ల పనులు త్వరగా పూర్తి చేసేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎంపిటిసి, తదితరులు

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

ప్రజాశక్తి- బలిజిపేట

మండలం పిఎస్ఎన్ వెంగాపురం గ్రామంలో స్థానిక ఎంపిటిసి గులిపల్లి మురళి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై స్థానిక బస్టాండ్ నుండి వెంగాపురం వరకు శనివారం ర్యాలీ నిర్వహించి దుకాణాల వద్ద ప్లాస్టిక్ వినియోగంపై వచ్చే అనర్ధాలు నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని ప్లాస్టిక్ వినియోగంపై భూకంపాలు వచ్చే ప్రమాదం ఉందని ప్లాస్టిక్ భూమిల కొన్ని వేల సంవత్సరాలు నిల్వ ఉంటుందని, భూమిలో కలిసే పరిస్థితి లేదని ఆయన అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఎస్ఎన్ కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గడగమ్మలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మ గ్రామంలో శనివారం స్థానిక వైద్యాధికారి బి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, జ్వర పీడితులు, కిషోర బాలికలు, మధుమేహ, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- బలిజపేట

మండలంలోని సుభద్ర గ్రామ పరిధిలో దాడులు నిర్వహించి ఆక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తున్న పెదిరెడ్ల గోపి నాయుడుని అదుపులోనికి తీసుకొని 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సిఐ సింహాద్రి తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం సీతానగరం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. ఈ దాడుల్లో హెచ్‌సి సుదర్శనకుమార్; కె. రాంబాబు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని హుస్సేన్ పురం గ్రామ సమీపంలో వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు చేయగా ఓ వ్యక్తి 124 సారా ప్యాకెట్లతో పట్టుబడినట్లు ఎస్ఐ జి కళాధర్ శనివారం తెలిపారు. పట్టుబడిన వ్యక్తి పై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈయనతోపాటు సిబ్బంది ఉన్నారు.

కోట దుర్గమ్మను దర్శించుకున్న ఆర్‌టిసి రీజియన్ చైర్మన్

ప్రజాశక్తి - పాలకొండ



దొన్నుదొరను సత్కరిస్తున్న కూటమి నాయకులు

పట్టణంలోని కోటదుర్గ అమ్మవారిని ఆర్‌టిసి విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర శనివారం దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ సిబ్బంది ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిని ఉన్నతశిఖాలకు తీసుకెళ్లాందుకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనిల్, నవీన్ ఉన్నారు.



అద్దె భవనంలో నడుస్తున్న వెలుగు కార్యాలయం ఇదే..

అద్దె భవనంలో వెలుగు కార్యాలయం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక వెలుగు కార్యాలయం కొన్నేళ్లుగా అద్దె భవనాలలోనే కొనసాగుతుంది. వెలుగు సిబ్బందికి సొంత భవనం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా సమావేశాలు నిర్వహించుకోవాలన్నా సొంత భవనం లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో ఆరుబయటే విధులు నిర్వహించాల్సి వస్తోంది. మండలంలోని 1569 పొదుపు సంఘాలు ఉన్నాయి. ఇందులో 1872 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ఎస్సీ గ్రూపులు 372, ఎస్‌టి గ్రూపులు 408, బిసి వికలాంగులు గ్రూపులు 1141, ఒసి గ్రూపులు 8 ఉన్నాయి. 41 మంది విఒలు ఉన్నారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్త్రీ శక్తి భవనం నిర్మాణానికి రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక ప్రభుత్వ గల స్థలంలో స్త్రీ శక్తి భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే సవరపు జయమణి శంకుస్థాపన కూడా చేశారు. అయితే అప్పట్లో భవనాన్ని నిర్మించకపోవడంతో ఆ నిధులు ప్రభుత్వం దారి మళ్ళించింది. మహిళా అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయి ఈ కేంద్రం ద్వారా మహిళలకు అందుతున్నాయి. వెలుగు కేంద్రంలో ఏర్పాటు చేసే ప్రతి మీటింగ్ కు సంఘ సభ్యులు ఎక్కువ కావడం కార్యాలయం చిన్నదిగా ఉండడం ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఈ భవన నిర్మాణం కోసం తర్వాత మాజీ ఎమ్మెల్యేలు బి.చిరంజీవులు, అలజంగి జోగారావు, ప్రస్తుత ఎమ్మెల్యే బి.విజయ్ చంద్రకు వెలుగు సిబ్బంది వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని వెలుగు కార్యాలయానికి సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వెలుగు సిబ్బంది, పొదుపు సంఘ సభ్యులు కోరుతున్నారు.

పలుచోట్ల 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగింది. ప్రతి రోజూ వివిధ పనుల కోసం అధిక సంఖ్యలో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటారని, అటువంటి వారికి ఆహ్లాదకర వాతావరణం కనిపించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాంగణంలో గల పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసి, అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం పిలుపునిచ్చిన సంగతి విదితమే. అందులో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని కలెక్టరేట్లో నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్లు, అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పారిశుధ్య విధుల్లో విశేష సేవలు కనబరచిన పారిశుధ్య కార్మికుడు జలగొడుగుల చిరంజీవికి కలెక్టర్ ఈ సందర్భంగా దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్యక్రమంపై జేసీ శోభికకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె. హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో...

పార్వతీపురం రూరల్ : జిల్లా పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ కార్యాలయం ఆవరణలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని, దీంతో మనసు ప్రశాంతతతో కూడి ఆరోగ్యకర వాతావరణంలో క్రమశిక్షణగా విధులు నిర్వర్తించొచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న డిసిఆర్‌బి, ఎస్‌బి, కమ్యూనికేషన్, మహిళా సెల్, డిపిఒ, ఆర్మ్డ్ రిజర్వు ఆఫీసులను అధికారులు, సిబ్బంది తమ కార్యాలయాలను శుభ్రం చేయడంతో పాటుగా చుట్టుపక్కల పరిసరాల్లో ఉండే చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను, పచ్చికను తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ సుధాకర్, ఎస్‌బి సిఐ రమేష్, ఎఆర్ ఆర్ఐ రాంబాబు, కార్యాలయంలో పనిచేసే ఎస్సైలు ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బందలుప్పిలో....

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బందులుప్పి వైద్యాధికారి డాక్టర్ తిరుమలప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను శనివారం పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి నెల 3వ శనివారం పరిసరాలను శుభ్రం చేయించమని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీరాములునాయుడు, జయగౌడు, నాగమ్మ, పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని కె.ఇచ్ఛాపురం గ్రామంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని, గ్రామస్తులకు సూచించారు. చిన్నగోర కాలనీలో సచివాలయ కార్యదర్శి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర దివాస్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి గౌరినాయుడు, పంచాయతీ కార్యదర్శి వసంత్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు, తదితరులు

ఐటిడిఎలో....

సీతంపేట : స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐటికె కార్యాలయంలో కార్యాలయ పరిసరాలను అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞ కూడా చేశారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, ఐటిడిఎ ఎఒ సునీల్, పిహెచ్ఓ ఎస్‌వి గణేష్, డిఇ సింహాచలం, డిప్యూటీ ఎస్ఒ అప్పారావు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో...

స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమన్నారు. కారక్రమంలో ఆర్ఎంఒ డివి శ్రీనివాస్, వైద్య నిపుణలు మనోహర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోనినాయుడు గూడ సచివాలయం పరిధిలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎపిఒ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కుసిమి పిహెచ్‌సిలో...

మండలంలోని కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో వైద్యాధికారి చాందిని ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. పరిశుభ్రత సంపూర్ణమైన ఆరోగ్యం ఉంటుందని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి కెవి రత్నం, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావివలస పిహెచ్‌సిలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆసుపత్రి పరిసరాలు, ప్రాంగణాన్ని తనిఖీ చేసి పరిశుభ్రతా తీరు గమనించారు. వైద్యులు, సిబ్బందితో కలిసి ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తను ఊడ్చారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించి,పరిశుభ్రత ఆవశ్యకతపై నినాదాలు చేశారు. ఆసుపత్రిలో బయోమెడికల్ వ్యర్థాలు,టాయిలెట్ల నిర్వహణ శుభ్రత తీరు పరిశీలించారు. కలర్ కోడ్ బిన్స్‌ను సక్రమంగా ఉపయోగించాలన్నారు. వైద్య సేవలు అందిస్తున్న తీరు,రికార్డులు,ల్యాబ్,లేబర్ రూం తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డాక్టర్ ఎం.వినోద్, వైద్యాధికారి డాక్టర్ కె. కార్తీక్, కార్యాలయ డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, సూపర్‌వైజర్లు ప్రకాష్, సన్యాసమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : ఇంటి పరిసరాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, సబ్ సెంటర్లు ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఎఇ రాములు ఆధ్వర్యంలో ఆ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కొమరాడ పిహెచ్‌సి వైద్యాధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పిహెచ్‌సి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఇలా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలను పరిశుభ్రం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట : స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి.కోనవలసలో ఎంపిడిఒ బివిజిఎ పాత్రో ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గంగన్నదొరవలసలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రారంభించారు. అలాగే వర్మీ కంపోస్టు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మి, ఎపిఒ బి.సత్యనారాయణ, సచివాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సత్యనారాయణ, ప్రభుత్వ ఐటిఐ ఇన్చార్జి ప్రిన్సిపల్ కోట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో ఉన్న వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా విడదీసుకుని తమ ప్రాంతానికి మున్సిపల్ వాహనాలు వచ్చినప్పుడు ఆ చెత్తలను అందజేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో 24వ వార్డు మహిళలకు వీధుల్లో బ్లీచింగ్ వేసి పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటిఐ ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీలో డిపిఒ కొండలరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు, ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ, ఎపిఎం ఆర్.శ్రీరాములునాయుడు, హౌసింగ్ ఎఇ జానకీరామ్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది, హరితరాయబారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని సరాయివలస శనివారం ఎంపిడిఒ డిడి స్వరూప రాణి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటి ముందు తడి పొడి చెత్తను వేరు చేసే విధంగా చూసుకోవాలన్నారు.అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దేవకుమార్, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: స్వచ్ఛాంధ్ర లో భాగంగా శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రి లో సూపరింటెండెంట్ డాక్టర్ విఆర్ మీనాక్షి ఆధ్వర్యాన వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత చేపట్టారు.రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తిర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



మక్కువ: మొక్కలు నాటుతున్న ఎంపిడి స్వరూపారాణి



సీతానగరం: పిచ్చి మొక్కలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది



పార్వతీపురం: చెత్తను తొలగిస్తున్న వైద్య బృందం

పీసాతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి- సీతంపేట

పీసాతోనే గిరిజన గ్రామాలాభివృద్ధి చెందుతాయని కుడ్డపల్లి కార్యదర్శి రిసోర్స్ పర్సన్ వై.పాపారావు అన్నారు. స్థానిక వైటిసి, వెలుగు కార్యాలయాల్లో వార్డు మెంబర్లు, ఉపాధ్యాక్షులు, కార్యదర్శలకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీసా తీర్మానంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. పీసా చట్టం విధులు బాధ్యతలు గురించి తెలియజేశారు. అటవీ హక్కుల గురించి, పీసా చట్టం వల్ల లాభాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ, రీసెర్చ్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీసా చట్టంపై శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. మూడు రోజులు పాటు నిర్వహించిన శిక్షణ తరగతులలో చివరి రోజు అబ్జర్వేటర్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ బివిజె పాత్రో, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు మాట్లాడారు. షెడ్యూల్డ్ గ్రామాల్లో పీసా చట్టానికి విశిష్ట అధికారాన్ని ప్రభుత్వం



సీతంపేట: అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ పాపారావు

కల్పించిందన్నారు. గ్రామపంచాయతీల్లో ఏ కార్యక్రమాన్నైనా గ్రామసభ ఆమోదిస్తేనే పంచాయతీ సభ్యులు తీర్మానాలు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ సంపద, మైనింగ్ నీటిపారుదల సహజ వనరులుపై పంచాయతీ సభ్యుల తీర్మానంతో పాటు గ్రామ సమైక్య సంఘాల తీర్మానాలకూ అంతే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రాంతాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: షెడ్యూల్ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు సంబంధించిన చట్టాలు, వాళ్ళ జీవన విధానాలపై తప్పనిసరిగా అక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు అవగాహన ఉండాలని ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీసా పరిధిలో ఉండే సచివాలయం ఉద్యోగులకు గిరిజన చట్టలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతాలలో గిరిజనుల జీవన విధానం, వారికి ప్రభుత్వం నుంచి ఏఏ పథకాలు అందుతాయో క్షున్నంగా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డిబివిఎస్ ప్రసాద్, గంజాయి భద్ర, కురుకుట్టి, సంపంగి పాడు, జిల్లేడు వలస, కొడమ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని జోగింపేట వద్ద రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహన దారులతో మాట్లాడుతూ వాహనదారుడు హెల్మెట్‌తో పాటు ఆ వాహనానికి సంబంధించిన పత్రాలన్నీ ఉంచుకోవాలన్నారు, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వరాదన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలపై అవగాహన కల్పించే విషయాలు తెలుసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

అంబులెన్సులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన ప్రజల వైద్యసేవల నిమిత్తం ఉచిత అంబులెన్స్ తక్షణమే ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల మండలంలోని కుంబికోటకు చెందిన కొండగొర్రి రాణి, పోలిరాజుల మూడు నెలల పాప విశాఖపట్నం కెజిహెచ్‌లో చనిపోతే మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు తీవ్ర అవస్థలుపడ్డారన్నారు. కుమార్తె మృతిచెందిందన్న బాధతో తల్లిదండ్రులు ఒకవైపు రాత్రంతా వేదన, మరోవైపు చనిపోయిన పాపను తమ స్వగృహానికి తీసుకురావడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పాపకు శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో అనారోగ్యం చేస్తే పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరం జిల్లా మహారాజ ఆసుపత్రికి అక్కడి నుంచి విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారన్నారు. అక్కడ శనివారం రాత్రి నాలుగు గంటల ప్రాంతంలో పాప మృతి చెందినట్లు



మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

వైద్యులు తెలిపారని అన్నారు. చనిపోయిన పాపను తన స్వగహాన్ని తీసుకెళ్లడానికి అంబులెన్స్ కోసం చేతిలో పైస లేకపోవడంతో ట్రైబల్ సెల్‌ను ఆశ్రయించినప్పటికీ వారి వద్ద కూడా తగిన నిధుల్లేక వారు కూడా అద్దె అంబులెన్స్ తీసుకొని చనిపోయిన గిరిజన ప్రజలను ఆయా గ్రామానికి పంపించే పరిస్థితి ఉందని అన్నారు. మన్యం జిల్లా కేంద్ర ఆస్పత్రి పేరుకు మాత్రమే కానీ మౌలిక వసతులు పూర్తిస్థాయిలు లేని పరిస్థితి ఉందన్నారు. ఇక్కడ ఎంఆర్ఐ స్కానింగ్, చిన్నపిల్లలకు మెరుగైన వైద్యమందించేలా మౌలిక సదుపాయాలు, ఇతర ఎటువంటి సదుపాయాల్లేవన్నారు. చిన్నపిల్లలకు సంబంధించి పది పడకల నుంచి 20 పడకలకు పెంచే ఆలోచన లేకపోవడంతో విజయనగరం, విశాఖ ఆసుపత్రులకు రోగులను ప్రతిరోజు పంపించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

వాతావరణ మార్పులపై శిక్షణ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ పంచాయతీ పరిధిలోని గోరపాడు గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆదివాసీ మహిళలు, పురుషులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు వల్ల కలిగే నష్టాలు, అధిక ఉష్ణోగ్రత వల్ల కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అధిక తేనే మంచు, తుపాన్లు కలిగే నష్టాలు, అధిక వర్షాలు వల్ల కలిగే నష్టాలపై శిక్షణలో తెలియజేశామన్నారు. ఆదివాసీల ఆదాయ వనరులైన అడవి, జీడిపంట, కంది, జొన్న కొర్రలు, ఊదలు వంటి పండలకు నష్టాలు వస్తున్నాయని, కొత్త విధానాలు, కుటుంబస్థాయి, గ్రామస్థాయిలో చర్చలు జరిపి ఇతర సహకార చర్చలతో నూతన ప్రణాళిక తయారు చేస్తామరని అన్నారు. ఈ వర్క్‌షాప్‌కు రిసోర్స్ పర్సన్ గమ వెన్నెల వ్యవహరించగా ఏరియా కోఆర్డినేటర్ వసంత, గోపాల్‌రావు, మిన్నారావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ పార్వతి, ఉమా లావణ్య, మొబలైజర్ మజ్జయ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లను కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం ఆ పార్టీ నాయకులు వి.దాలినాయుడు, కోలా కిరణ్, శిరసపల్లి సాయి శ్రీనివాస్ తదితరులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి మున్సిపాలిటీని వేధిస్తున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రతిరోజూ తాగునీటిని సమయపాలనతో సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. 4,5 రోజులకు ఒకసారి కుళాయి నీరు సరఫరా చేస్తున్నారని, మున్సిపాలిటీని పారిశుధ్య సమస్య వేధిస్తుందని తెలిపారు. తక్షణమే పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, అవసరమైన సిబ్బందిని నియమించి, కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా మున్సిపాలిటీని వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో గల చెరువులన్నీ కబ్జాకు గురయ్యాయని, వీటిని తొలగించి చెరువులను పరిరక్షించాలని కోరారు. కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో దోమలు అధికంగా వేధిస్తున్నాయన్నారు. దోమల నివారణకు ఫాగింగ్‌తో సహా తగు చర్యలు చేపట్టాలని కోరారు. లబ్ధిదారులు ఎదురుచూస్తున్న టిడ్కో గృహాలు అందజేయాలన్నారు. మున్సిపాలిటీ రోడ్లు గోతుల్లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మెయిన్ రోడ్ లో సంచరిస్తున్న పందులు, పశువుల సమస్యపై చర్యలు తీసుకోవాలన్నారు.

వరహాలగెడ్డలో వ్యర్థాలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాని రహదారికి ఆనుకుని ఉన్న వరహాలగెడ్డలో వ్యర్థాల తొలగింపు చర్యలను మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. వార్డు పర్యటనలో భాగంగా శనివారం కమిషనర్ స్థానిక పాత బస్టాండ్, బంధంవారి వీధి, రాయగడరోడ్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం వరహాలగెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజారోగ్య విభాగం అధికారులు, సచివాలయాల శానిటరీ సెక్రటరీల పర్యవేక్షణలో మున్సిపల్ జెసిబి సహాయంతో పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్న పనులను పర్యవేక్షించారు. అనంతరం బెలగాం చర్చి వీధిలో ఉన్న మున్సిపల్ పార్కు, అన్న క్యాంటీన్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించి పరిశీలించారు. పారిశుధ్య పనులను చేయించడంలో అలసత్వం వహించిన 10వ వార్డుకు చెందిన ఐదో



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

సచివాలయం శానిటేషన్ సెక్రటరీకి, మేస్త్రికి మెమోలు జారీ చేశారు. ఈ పర్యటనలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పకీరు రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినయ్, శానిటేషన్ సెక్రటరీలు అచ్యుత్, వెంకటరమణ, వెంకటేష్ మరియు మేస్త్రిలు సాయి, గోపాల్ పాల్గొన్నారు.